క్లుప్తంగా

వైభవంగా కోనేటిరాయుని ఊంజల్ సేవ



గంగవరం: పౌర్ణమిని పురస్కరించుకుని కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో ఆదివారం ఊంజల్ సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఊంజల్‌పై కొలువుదీర్చి మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చారణ నడుమ ఊంజల్ సేవ చేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ఊంజల్ సేవను వీక్షించి తరించారు.

నేడు పర్యావరణ దినోత్సవంపై సమావేశం

పుంగనూరు: పట్టణంలోని న్యాయవాదుల సంఘ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 11 గంటలకు పర్యావరణ దినోత్సవ సమావేశం నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్‌జడ్జి వాసుదేవరావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రకటన విడుదల చేశారు. న్యాయవాదులు, అటవీశాఖ అధికారులతో కలసి పర్యావరణ కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన చర్యలు గురించి చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న సుధీర్‌రెడ్డి

సదుం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వ్యవసాయ సలహామండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. బూరగమంద క్రాస్ నుంచి ఇటీవలే నిర్మించిన డబుల్‌రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, భాగిరెడ్డి, అరుణ్, శంకరప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.


గాన గంధర్వునికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న సమితి నిర్వాహకులు

పలమనేరు: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకుడు తులసీనాథం నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఎస్పీ చిత్రపటానికి నివాళులర్పించారు. తెలుగు పాటను ప్రపంచవ్యాప్తం చేసిన ఘనత ఆయనే దక్కిందన్నారు. పలువురు గాయకులు ఎస్పీ పాటలను పాడి అలరించారు. కార్యక్రమంలో పుష్ప, సిద్ధారెడ్డి, దేవరాజు, చెంగ్రలాయప్ప, దవణముని, గిరిధర్ పాల్గొన్నారు.

రైతు బాగుంటేనే దేశం సుభిక్షం



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె: రైతు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. బైరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద ఆదివారం సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. గతంలో రైతులు వేరుశనగ విత్తనాలు తీసుకునేందుకు క్యూ లైన్లలో నిలబడి సొమ్మసిల్లి పోయేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా విత్తనాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అన్నదాతల సంక్షేమానికి ముఖ్యమంత్రి విశేష కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర బాలాజీ, వ్యవసాయశాఖ అధికారి మునిక్రిష్ణ, సర్పంచ్ వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్, వైఎస్సార్‌సీపీ నేతలు శంకర్‌రెడ్డి, జయకుమార్ రెడ్డి, కార్తిక్, పైజుల్లా, పాపన్న, మునివెంకటప్ప, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్బీకేలతో వ్యవసాయం విస్తృతం

- అన్ని దశల్లోనూ రైతులకు చేయూత
- విత్తనం నుంచి విక్రయం వరకు అండ
- సాంకేతికత బదలాయింపులో కీలక పాత్ర

అందరి ఆకలిని తీర్చే అన్నదాతలకు దన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం తీసుకువచ్చిన వైఎస్‌ఆర్ రైతు భరోసా కేంద్రాల వ్యవస్థ పారదర్శకత, సమర్థతతో మూడేళ్లలోనే అంచనాలకు మించి విజయం సాధించింది. విత్తనాలు మొదలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మొదలైనవన్నీ రైతుల ముంగిటకే చేరుతోంది. నిత్యం వారికి సాయంగా నిలుస్తూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా, మార్గదర్శకంగా నిలిచాయి.





సొన్నేగానిపల్లిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, కియోస్క్ యంత్రం, ఆర్బీకేలో ఏర్పాటు చేసిన టీవీ, పుస్తకాల లైబ్రరీ

శాంతిపురం: మట్టిని నమ్ముకున్న రైతన్నలు విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రానికి వచ్చి క్యూలలో గంటల తరబడి నిరీక్షించినా ఒక్కోసారి అందని పరిస్థితి. శ్రమకోర్చి పంటలు పండించినా గిట్టుబాటు ధర లభించక దళారుల పాలయ్యేది. మరోవైపు సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు, యంత్రాలను రైతుల పేరిట పచ్చనేతలే హాంఫట్ చేయడం..ఇదంతా టీడీపీ పాలన నాటి పరిస్థితి. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో విత్తనాలు మొదలు ఎరువులు, వ్యవసాయ పనిముట్లు మొదలైనవన్నీ రైతుల ముంగిటకే చేరుతోంది. ఈ సంస్కరణలు, జవాబుదారీతనంతో అందిస్తున్న సేవలు తమకు వ్యవసాయంపై భరోసానిచ్చేలా ఉంటున్నాయని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

రైతుల ముంగిటకే సేవలు

మండల కేంద్రం స్థాయికే పరిమితమై ఉన్న వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖల సేవలను ఆర్బీకేల ద్వారా గ్రామీణ స్థాయికి విస్తరించింది. రైతులకు సాంకేతికత బదలాయింపు, దిగుబడుల నాణ్యత పెంపు, ఆధునిక పరికరాల వినియోగం, రాయితీపై ఎరువులు–విత్తనాలు, రసాయన రహిత సేద్యం, రాయితీ పరికరాలు, పంటల బీమా... ఇలా అన్ని దశల్లోనూ రైతులకు చేదోడుగా మారాయి. దుక్కి తయారీ నుంచి పంట విక్రయం వరకు అన్ని స్థాయిలలోనూ రైతుకు అండగా నిలుస్తున్నాయి. సీజన్‌కు తగిన పంటల సాగు, దుక్కి తయారీ, విత్తనాల ఎంపిక, సమగ్ర సస్యరక్షణ, నూర్పిడి వంటి అంశాలపై డిజిటల్ లైబ్రరీలు, ముద్రిత సమాచారానికి ఆర్బీకేలు కేంద్రాలుగా మారాయి. ఆధునిక వ్యవసాయంపై ఎప్పటికప్పుడు శిక్షణ పొందుతున్న ఆర్బీకే సిబ్బంది రైతులకు ఆయా సాంకేతికతను, విజ్ఞానాన్ని బదిలీ చేస్తున్నారు. వ్యవసాయ సలహా మండలి ఏర్పాటుతో స్థానిక పరిస్థితులకు అవసరమైన విత్తనాలు, పరికరాలను ఆర్బీకేలు సమకూర్చుకుంటున్నాయి. ఉత్తమ పనితీరుతో బహుళ ప్రయోజనాల కేంద్రాలుగా మన రైతుల మన్ననలతో పాటు ఇతర రాష్ట్రాలు, దేశాల రైతుల ప్రసంశలు అందుకుంటున్నాయి. ఆర్బీకేలపై అధ్యయనం చేసిన కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు అక్కడ కూడా ఇదే తరహా కేంద్రాల ఏర్పాటుకు సమాయత్తం అవుతున్నాయి.

కియోస్క్:

వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాల్లో ఆధునిక కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను ముందుగానే బుక్ చేసుకుని తెప్పించుకోవచ్చు. ఈ–క్రాప్ నమోదు, పంటల బీమా, రాయితీ పథకాలను అందుకోవడానికి బయోమెట్రిక్ పరికరాలు ఉపయోగపడుతున్నాయి.

డిజిటల్ లైబ్రరీ

ఆర్బీకేలలో టీవీలను ఏర్పాటు చేసి, వివిధ పంటల సాగుపై నిపుణులు, అనుభవజ్ఞులైన రైతులతో రూపొందించిన వీడియోలను అందుబాటులో ఉంచారు. దీనితో పాటు పంటల వారిగా దుక్కిని సిద్ధం చేయడం నుంచి పంట నూర్పిడి వరకు రైతులకు కావాల్సిన సమగ్ర సమాచారంతో సిద్ధం చేసిన పుస్తకాలను లైబ్రరీలలో పెట్టారు. ఫోన్ ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి కార్యాలయ పని వేళల్లో ఉన్నత అధికారులు అందుబాటులో ఉంటున్నారు.

శాంతిపురం మండల సమాచారం :
మొత్తం ఆర్బీకేలు : 20
మొత్తం సిబ్బంది : 29 మంది
ఆర్బీకేల నిర్మాణం కోసం : రూ 4.80 కోట్లు
ఆర్బీకేలలో వసతుల కల్పనకు : రూ 48 లక్షలు
ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాల కేంద్రాలు (సీహెచ్‌సీలు): 20
సీహెచ్‌సీలకు పరికరాలు : రూ 1.20 కోట్లు
అందించిన రైతు భరోసా: రూ 40.88 కోట్లు(7.570 మందికి)
విత్తనాలపై రాయితీ : రూ 6.93 కోట్లు
పంపిణీ చేసిన ఎరువులు: 590 మెట్రిక్ టన్నులు
పంటల బీమా ద్వారా : రూ 3.56 కోట్లు

పథకాల సమాచారం తెలుస్తోంది



ఆర్బీకేల పుణ్యమా అని వ్యవసాయ, దాని అనుబంధ శాఖల్లో వస్తున్న పథకాలు ఎప్పటికప్పుడు తెలుస్తున్నాయి. గతంలో రాయితీ పథకాలు కొందరికే అందేవి. ఇప్పుడు ఆర్బీకే సిబ్బంది, వలంటీర్లు విస్తృత ప్రచారం చేస్తుండడంతో ఎవరైనా వాటిని అందుకునే అవకాశం దొరికింది. సీజన్‌కు ముందుగానే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంటున్నాయి. రైతు భరోసా లాంటి పథకాలను అందుకోవటంలో ఏవైనా సమస్యలు ఉంటే గ్రామ స్థాయిలోనే పరిష్కరిస్తున్నారు. –బి.సురేష్‌బాబు, రైతు, దండికుప్పం

మండల కేంద్రం వెళ్లే బాధ తప్పింది



గతంలో అధికారులతో ఏ చిన్న పని ఉన్నా మిగతా పనులు వదులుకుని మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్బీకే రావడంతో మా ఊర్లోనే అన్ని పనులు సులవుగా చేయించుకుంటున్నాం. ఆర్బీకే సిబ్బంది సహకారంతో సేంద్రీయ సేద్యం వైపుకు మారుతున్నాను. రైతులు గ్రూపుగా ఏర్పడి రాయితీతో ట్రాక్టర్, దానితో వాడే వ్యవసాయ పరికరాలు, చాప్ కటర్లు తీసుకున్నాం. –ఎం.నాగరాజు, రైతు, రాళ్లబూదుగూరు

నేటి నుంచి కొంగాటంలో గడపగడపకు..

వి.కోట: మండలంలోని కొంగాటం పంచాయతీలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ యువరాజు తెలిపారు. శివునికుప్పం, కొంగాటం గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ పర్యటిస్తారన్నారు. మంగళవారం కనమనాయనపల్లి, సి.ఎల్లాపురం, బుధవారం జీడిగుట్ల, గంగాపురం, శివునికుప్పం గ్రామాల్లో ఉంటుందన్నారు. మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని కోరారు.

నియామకం



రాచపల్లె బాలాజీ

పులిచెర్ల(కల్లూరు): సౌత్ ఇండియా వైశ్య యూత్ పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ అధ్యక్షుడిగా కల్లూరుకు చెందిన రాచపల్లె బాలాజీ నియమితులయ్యారు. ఆదివారం తిరుపతిలో సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. టీటీడీ బోర్డు సభ్యుడు మురంశెట్టి రాములు వ్యవస్థాపక చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శిగా వికాస్, కోశాధికారిగా శివప్రసాద్ నియమితులయ్యారు. బాలాజీ మాట్లాడుతూ.. వైశ్యుల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడం, సనాతన ధర్మాలను కాపాడడం, గోసేవ ముఖ్య ఉద్దేశమన్నారు.

వేడుకగా గొల్లపల్లెమ్మ ఉత్సవాలు



గొల్లపల్లెమ్మ ఆలయంలో భక్తులు

రొంపిచెర్ల: మండలంలోని గానుగచింత పంచాయతీ దాసరిగుడెంలో గొల్లపల్లెమ్మ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు గంపలతో ఆలయం వద్దకు తరలి వచ్చారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరామయ్య, మాజీ ఎంపీటీసీ బాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏటిగడ్డ ఎల్లమ్మ జాతర

పలమనేరు: మండలంలోని మొరం పంచాయతీ క్యాటిల్‌ఫామ్ వద్ద వెలసిన ఏటిగడ్డ ఎల్లమ్మ జాతర సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. సోమవారం గణపతి హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. మంగళవారం పొంగళ్ల సమర్పణ, రాత్రి అమ్మవారి శిరస్సు మెరవణి ఉంటుందన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలోని విజలాపురం రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు రాయితీ వేరుశనగ విత్తనాలను చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తన కాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబు రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ గౌడు, మాజీ సర్పంచ్ నారాయణప్ప, నరసింహులు, వీపీ ఆనంద్ పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవాన్ని పండుగలా చేద్దాం



సన్మానం పొందిన ప్రజా సంఘాల ప్రతినిధులు

పలమనేరు: పర్యావరణ దినోత్సవాన్ని పండుగలా నిర్వహిద్దామని పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర అన్నారు. రేపటి సమాజానికి వృక్షాల అవసరాన్ని వివరిస్తూ పట్టణవాసుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. భారీగా మొక్కల నాటకాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాలు, స్థానికంగా మొక్కలను పెంచే నిర్వాహకులను ఘనంగా సన్మానించారు.

దాడి చేశారని ఫిర్యాదు

రొంపిచెర్ల: తోటలో మామిడి కాయలు కోస్తుండగా అడ్డుకున్న తమపై దాడి చేశారని రొంపిచెర్ల మండలం దుస్సావాండ్లపల్లెకు చెందిన ఆనందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రామానికి చెందిన చంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వేరుశనగ విత్తనాలకు పేర్లు నమోదు

గంగవరం: స్థానిక రైతు భరోసా కేంద్రంలో సోమవారం వేరుశనగ విత్తనాల నమోదు కార్యక్రమం జరుగుతుందని ఏఓ హేమలత తెలిపారు. గంగవరం–2 సచివాలయ పరిధిలోని రైతులు ఆధార్, భూమి పాస్‌బుక్, మొబైల్ ఫోన్‌ను తీసుకు రావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

రామకుప్పం: మండలంలోని అటవీ ప్రాంతంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు డీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన సత్య, జయరాం, శాంతమూర్తి, సౌందర్ నాయక్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అడవిలో ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఘనంగా గంగవరం గంగమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

గంగవరం: మండల కేంద్రంలో గంగమ్మ జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి అమ్మవారి శిరస్సును గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు అమ్మవారి ఎదుట కొబ్బరికాయలు కొట్టి సారెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ నడివీధిలో అమ్మవారి ప్రతిమను కొలువుదీర్చారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ పార్టీ నాయకులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ఆనందరెడ్డి ఉన్నారు.

కుప్పం అభివృద్ధికి మరిన్ని నిధులు



తగరాలతండాలో బోరు డ్రిల్లింగ్‌కు భూమి పూజ చేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: కుప్పం నియోజక వర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. ఆదివారం మండలంలోని బందార్లపల్లి పంచాయతీలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్‌తో కలసి ఎంపీ రెడ్డెప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. లబ్ధిదారులు ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఎంపీ మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి కుప్పం అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం వారు ఎర్రచేన్లు సమీపంలో జగనన్న లే అవుట్ ఏర్పాటుకు భూ పరిశీలన చేశారు. జగనన్న లే అవుట్‌ను త్వరితగతిన పూర్తిచేసి అర్హులకు పట్టాలను అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తగరాల తండాలో జెడ్పీ నిధులు సుమారు రూ.5 లక్షల వ్యయంతో తాగునీటి కోసం ఏర్పాటు చేస్తున్న బోరు డ్రిల్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. జెడ్పీ నిధులను మంజూరు చేసిన స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డిని ఎంపీ, ఎమ్మెల్సీ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ రాజ్‌గోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు సౌమ్య, పార్టీ మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సచివాలయ కన్వీనర్ సుబ్రమణ్యం, నేతలు జనార్దన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, బోర్‌వెల్ చెంగారెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న జీజీఎంపీ పనులు



రాయలపేటలో పూర్తయిన సిమెంటు రోడ్డు

పెద్దపంజాణి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాయలపేట సచివాలయానికి ఎమ్మెల్యే వెంకటేగౌడ రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఈ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే దాసనంపల్లి, రాయలపేట గ్రామంలో సుమారు రూ.5 లక్షలతో సిమెంటు రోడ్లు పూర్తయ్యాయి. చిన్నపీర్ల మఠం వీధిలో రూ.6.5 లక్షలతో మురుగునీటి కాలువ పనులు జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో పక్కా రోడ్లు, మురుగునీటి కాలువల కోసం అనేక సార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే లేడని గ్రామస్తులు ఆరోపించారు. అయితే వైఎస్సార్‌సీపీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తమ సమస్యకు పరిష్కారం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు.



ఆలయాల్లో పౌర్ణమి పూజలు



పుంగనూరులో ప్రత్యేక అలంకారంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి, మారెమ్మ, శ్రీఅభయాంజనేయస్వామి

పుంగనూరు: పున్నమి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని భగత్‌సింగ్‌కాలనీ వద్ద ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో హోమాలు, పూజలు నిర్వహించారు. మండలంలోని ఏడూరు గ్రామం వద్ద వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీ విరూపాక్షి మారెమ్మకు పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, చలిపిండి, చల్లముద్ద, గుమ్మడి కాయలు, నిమ్మకాయలతో దిష్టితీసి దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పలమనేరు ఏఎంసీ అభివృద్ధికి వినతి

పలమనేరు: పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలని ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి మంత్రి ఉషశ్రీచరణ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం కళ్యాణదుర్గంలోని ఆమె నివాసంలో ఆమెను కలిసి వినతి పత్రం సమర్పించారు. పలమనేరులో ఇంటిగ్రేటెడ్ మోడల్ టమాట మార్కెట్, శివునికుప్పం మ్యాంగో మార్కెట్ల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

పుంగనూరు: ప్రజలు సురక్షిత ప్రయాణాలకు, సరుకుల రవాణాకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి కోరారు. ఆదివారం ఆయన డిపోలో ఉద్యోగస్తులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. రాజారెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్లుగా ప్రజల అవస్థలు గమనించి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవ తీసుకుని డిపో ఏర్పాటు చేశారని కొనియాడారు. డిపో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎం సుధాకరయ్య, వైఎస్సార్ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, కార్మిక సంఘ కార్యదర్శి కరీముల్లా పాల్గొన్నారు.

